వర్షంలో మనిషి

వి.యస్.భారతీమూర్తి

పొడుగాటి నీడలు పరుచుకుంటూ పోతున్నది సాయంత్రం.

రోడ్డుకు వారగా, జనసమూహంలో ఒంటరిగా చలపతి. ఆలోచన మోస్తున్న తల బరువుగా వంగింది. నీరసాన్ని మోస్తున్న కాళ్లు నింపాదిగా నడుస్తున్నాయి. బుగ్గలు —చిన్నప్పుడు పక్కింట్లో పడుచుదనం పొడుచుకొస్తున్న కుర్రది 'కరివేపాకు కోసియ్యవూ చలపతీ!' అని పిలిచి గట్టిగా, బలంగా, ఆబగా పత్తి ముద్దు పెట్టుకునే వాటిలాకాక గాలిపోయిన రబ్బరు బుడగల్లా చప్పబడి పోయాయి. కళ్లు—అదృష్టహీనుడి సంతోషదినాల్లా వెనక్కి వెళ్తున్నాయి; కను బొమ్మల వసారాల్లో లోలోపల దాక్కుంటున్నాయి. భుజాలు బరువుతో వాలినట్లున్నాయి.

'ఓ జన్మలో చేసిన కర్మఫలం మరో జన్మలో అనుభవిస్తారని కదా అంటారు. పోయిన జన్మలో ఎటువంటి పాపం చేస్తే యీ జన్మలో మనిషి నయ్యానా!' అని ఆశ్చర్యపోతుంటాడు చలపతి. ఈ ఆశ్చర్యం యీనాటిదీ నిన్నటిదీ కాదు. చలపతికి సుమారు ముప్ఫయ్యేళ్లొచ్చిం దగ్గర్నుంచీ అతనితో వుంటోంది. దాని తోడువలన ఒంటరితనం అనేదేంటో ఎరక్కుండా వున్నాడు అతను.

చలపతి ప్రశ్నకు జవాబులా దగారంగా జరుగుతున్నది సాయంకాలం. వెంట తెచ్చిన నీరెండలో అతని నీడ. స్వతంత్రానికి ప్రతినిధుల్లా ఆకాశంలో రెక్కలార్చుకుంటూ వెళ్తున్న పక్షులు.

తూర్పు దిక్కునుంచి నల్లటి మబ్బులు ప్రాక్కొస్తున్నాయి. చిన్నప్పుడు—ఆరేడేళ్ల వయసునాడు—యిలాంటి మబ్బుల్ని చూసి 'వానా వానా వెల్లువ' ఆడుకునేవాడు ఈ పెడా ఆ పెడా వుండే కుర్రవాళ్లతో కూడి. కాలేజీ చదువు వయసొచ్చేసరికి—ఇంటర్మీడియట్ ఫేలయ్యేనాటికి — యిలాంటి మబ్బుల్ని చూస్తే ఏదో తియ్యనిబాధతో

ఊహాతీత ఊహాలతో ఉక్కిరి బిక్కిరి అయ్యేవాడు. తన మేనకోడలు రమాదేవిని—ఆ అమ్మాయిని ప్రేమించాననుకునేవాడు చలపతి—ఒంటరిగా ఏదో జలపాతాలున్న ప్రాంతానికి తీసుకువెళ్లి ఒళ్లో పడుక్కోబెట్టుకుని మేఘసందేశంలాంటి సాహిత్యం చెప్పాలని అనుకునేవాడు. ఆ రమాదేవి భార్య అయింతర్వాత—అంటే రామి అయింతర్వాత—ఏడాదిదాకా క్రొత్తగా చేరిన ఉద్యోగం కావటు పనిమూలాన ఎప్పుడూ తీరికే కుదిరిందికాదు. ఏదో రాత్రిళ్లు పక్కలో చేరినప్పుడు నిద్రబరువుతో వాలిపోతున్న కళ్ల మధ్యనుండి అందిన చూపులో అందంకన్నా ఆవేశం ఎక్కువగా కనబడేది. ఏడాది తిరక్కముందే ఆవిడకి బాబీ పుట్టడంతో ఊపిరి తిరిగేదికాదు. మేఘాలు—వాటిలో సందేశాలు యిప్పుడు చలపతికి అందకుండా వయసు కుర్రాళ్ల హాకిళ్ల ఆశ్రయించుకుంటున్నాయి. బహుశః వాళ్ల బాబీని—వాడి తర్వాత పుట్టిన లక్ష్మీదేవిని (యింకా ఎక్కడి లక్ష్మీదేవి?)—ఆ తర్వాత కన్న చిట్టి తల్లిని ఆశ్రయించుకుంటున్నాయేమో! ఈ రోజున యిదే మేఘాలు చూసి గొడుగ్గూడా కొనుక్కోలేదే యిన్నేళ్ల జీవితంలోనూ అని చింతవడ్డానిక్కూడా ఓపికలేక స్తబ్దుగా నడిచిపోతున్నాడు చలపతి.

మేఘాలు చినుకులై నేలమీద రాలుతున్నాయి నక్షత్రం పువ్వుల్లాగా! గొడుగులున్నవాళ్లు ఒడుపుగా వ్యాయామం చేస్తున్నారు వానకు నేస్తంగావచ్చిన గాలివిసురుకు నిలబడ్డం కోసం. బోలెడుమంది జనం గోడవారుకూ, కొంపల వసారాల్లోకి, చెట్ల నీడల్లోకీ (ఈ మున్సిపాలిటీ రోజుల్లో చెట్లు ఎక్కువగా ఎక్కడున్నాయిలెండి!) తప్పుకుంటున్నారు. చలపతికి తప్పుకోవాలని అనిపించలేదు ఎందుకనో! అతని పక్కనే పడుస్తున్న ఎద్దుకూడా వర్షంలోంచి తప్పుకోలేదు!

పగలంతా బండిక్కట్టిన గుర్రంలా అలసిపోయి, సాయంత్రంవేళ కాసేపు గాలి పీల్చుకుందామని బయటపడితే వానకూడా పడాలా అదేసమయానికి. జనానికి విసుగ్గావుంది యీ తంతు.

'ఏమిటయ్యా వెధవ బ్రతుకు మనిషి జన్మెత్తాక బ్రతికితే ఏ నైజాంలాగానో, తాతాలాగానో, ఆఖరికి మన ఆఫీసు మేనేజరులాగానో బతకాలిగానీ ఈ వర్షం బ్రతుకేమిటంట!'

'రెయిన్‌కోటు కొనుక్కునే తాహతులేదుగానీ నైజాంలాగా మేనేజరులా బ్రతుకుతాం!'

గోడపక్కకు చేరిన ఎవరో యిద్దరు చలపతులు—నడివయసువాళ్ల సంభాషణ చెవిని పడింది చలపతికి.

వాళ్లదగ్గర ఓక్షణం ఆగి మాట్లాడిపోతే బాగుండునని అనుకున్నాడు చలపతి. కానీ ఆగలేదు. అలా తడుస్తూనే పోతున్నాడు.

వర్షం—బరువుగా తడిగా జడిగా పడుతున్న నీళ్లవర్షం. జుట్టులోంచి మొహంమీదకు జారుతుంటే గొంగళిపురుగు నడిచినట్లున్న వర్షం.

రామి ఏమేమిటో తెమ్మని చెప్పింది యింట్లోనుంచి బయలుదేరేముందు. ఇంట్లో ఎదిగిన ఆడపిల్లలున్నట్లు, వాళ్లకు పౌడరు స్నో అవసరం వున్నట్లు రామి అంటూండే మాటలు గుర్తొచ్చాయి చలపతికి.

'అలా కాలేజీవైపు వెళ్లిరండి. ఆడపిల్లలు ఎంతగా ముస్తాబవుతుంటారో; వాళ్ల వేషాల ధోరణిలో ఎన్ని కొత్తకొత్త హంగులున్నాయో తెలుస్తుంది. ఇంట్లో పెళ్లికెదిగిన పిల్లలున్నారని మనసుకు పట్టించుకుంటే—కాస్త వాలుగుకాసులు వెనకేసుకొచ్చుంటే......' ఆ మాటలన్నీ మరీ మామూలైపోయాయి. మొదటిసారి విన్నప్పుడు ఏదో జవాబియ్యపోయి మాట్లాడ్డం ఆపి వూరుకున్నాడు. మరీ అస్తమానం అంటుంటే విసుగొచ్చి 'హోర్మయ్' అనీ, 'చావు' అనీ పెళ్లాన్ని కసురుతాడు. మరీ పెట్రేగిపోతుంటే మొగుడు, పెద్దవాడూ అనే లెక్కలేకపోతుంటే చస్తాడు గనకనా! అసలే అసమర్థుడు,

డబ్బుంటే హంగులు. ఆ సంగతి రామికి తెలీదు గనకనా; పీరిగాడు నారిగాడ్ని, నారిగాడు నోరిగాడ్ని అన్నట్టు పక్కవాడిమీద పారబోస్తే మన దుమ్ము కొంతైనా వదుల్తుంది. మన బరువు కాస్తైనా తగ్గుతుంది. ఏం చేస్తుందది? వాళ్లుదాన్ని దులుపుతుంటే, అది తన్ని...అసలే 'పోషించలేనివాళ్లు ఎందుక్కన్నారంట—పుట్టగానే చంపి పారేయాల్సింది' అని పిల్లలు తల్లినీ తండ్రిని ఎదురు తిరిగి కడిగేసే రోజులాయి యివి అని ఒకటి రెండుసార్లు జాలిగూడా పడ్డాడు చలపతి......

వయసులో వున్నప్పుడోసారి వర్షం పడుతుంటే ఆ జల్లులు చూసి శోభనం గది మంచానికట్టిన మల్లెదండల్లా వున్నాయనుకున్నాడు చలపతి. యిప్పుడదే వర్షం చూస్తుంటే జైలు కటకటాల్లా ఉన్నాయనిపిస్తోంది...

నలభైనాలుగేళ్ల క్రితం, ఆముదం దీపం వెలుగులో ఓకాలు ఊగిసలాడుతున్న కుక్కిమంచంమీద పడుక్కుని 'గుమాస్తా ఉద్యోగం చేసుకు బ్రతుకు వాయనా — మీనాన్నలాగా వ్యవసాయం మాత్రం వద్దు' అని కనిపడేసింది చలపతిని వాళ్లమ్మ. పదేళ్లవయసులో ఓసారి కాలవలో యీదబోయి చేతకాక నీళ్లుతాగేసి చచ్చిపోవడానికి సిద్ధపడితే 'నీవాటూ దౌర్భాగ్యం యిక్కడే వుందిరా చలపతీ!' అంటూ బ్రతికించాడు సిద్ధాంచారి మందులు తినిపించి.

ఓసారి—వీధి చివర కలక్టరు గారబ్బాయి కొనుక్కున్న ఫారిన్ దొరసాని బొమ్మ చూపి కావాలని మారాం చేస్తే వాళ్ళ చితకబాది ప్రపంచంలో జనం ఎందుకు పుడ్తారో, వాళ్ల కర్మలంటే ఏమిటో, మొదలైన గాఢమైన జీవిత రహస్యాలు తెలియచేశాడు వాళ్లనాన్న. కొందరు ఆసాములుగా పుడ్తారనీ, అది వాళ్ల పూర్వజన్మ సుకృతం అనీ—మరి కొందరు వాళ్లకు గులాములై పుట్టి సలాములు చేస్తూ బ్రతుకుతారనీ—ఇది సృష్టి రహస్యం అనీ, మరోజన్మలో మనమూ మహారాజులుగా పుట్టవచ్చనీ—భగవంతుడు యీ రకమైన బ్రతుకులు సృష్టించాడనీ అద్భుతమైన జ్ఞానబోధ చేశాడు ఆయన. అందుకనే కలక్టరుగారికి వాళ్లనాన్న గులామైతే వారబ్బాయికి చలపతి గులాంగా మసలడం నేర్చుకున్నాడు. గుమాస్తా జీవితంలో అవసరమైన ఓర్పూ అవీ అనాడే సంపాదించి వుంచుకున్నాడు. అనాటి కలెక్టరు గారబ్బాయి ఈనాడు మేజిస్ట్రేటై న్యాయాన్ని పంచుతుంటే, చలపతి గుమాస్తాగా తన కుక్కి మంచంలోని నల్లులకి రక్తం పంచిపెడ్తున్నాడు.

చలపతి లాంటి గుమాస్తా స్టూడెంటు ప్రేమించడం విచిత్రమైన సంగతిలా అనిపిస్తుంది. అదేం లేదు, చలపతి ప్రేమించకముందే రమాదేవి అతని భార్యగా అయిపోయింది. అంటే ఆమె పూర్వజన్మ

వర్షంలో మనిషి

ముక్కారం గుమాస్తా భార్యగా పుట్టమని ఆదేశించిందని అర్థం. తొలినాడు పలకరించుకున్నప్పుడు వాళ్ళిద్దరూ అలాగే అనుకున్నారు కూడా! అందుకనే రమాదేవి ఆరో క్లాసుతో చదువుమానేసి గరిట అందుకుంది చలపతి పరీక్ష అవడం మానేసి ఫైళ్ళలో చేరిపోయాడు...

'దీని తంతు నాకేమిటో అంతు బట్టటం లేదండి. మొన్న ఆ మహాతల్లి పెళ్ళైన రెండవ రోజునుంచి అతిఘోరణి మొదలు పెట్టింది. రెండురోజులు జ్వరం కాసిందో! ఇందాక మీరు వెళ్ళి నప్పటినుండి రెండు గంటలు కచేరీ చేసింది. ఏమిటో పిచ్చివాగుడు. చచ్చిపోతానంటుంది పరీక్ష ఫేలవలేదుట దాని పేపర్లు ఎవడో దొంగతనం చేసి పారిపోయాట్ట. 'నాన్న వట్టినాజమ్మ—వాడ్ని పట్టుకోనూ గూడాలేదు'... ఓ రోజు చలపతి యిల్లుచేరిన వెంటనే రామి చలపతి చెవిన వేసింది పిడుగులాంటి వార్త. రామి ప్రసంగంలో దొర్లిన మహాతల్లిదో వింత గొడవ. వాళ్ళనాన్న ఓ ఐదుగుర్ని కని పెద్ద వాళ్ళు ముగ్గురికీ పెళ్ళిళ్ళుచేసి, చిన్న వాళ్ళనిద్దర్ని వదిలి—ఇద్దర్ధూ 'మహాతల్లు'లే—వాళ్ళకిద్దరికీ చెరో పదివేలూ ఆస్తి యిచ్చి చచ్చిపోయాడు. క్రితం సంవత్సరం చలపతి తొమ్మరిది కామేశానికి యిద్దరు మహాతల్లుల్లో పెద్దావిడతో వివాహం జరిగే వరకూ వాళ్ళగురించి చలపతి కేమీ తెలిసింది కాదు. పెళ్ళయ్యే వరకు — స్వతంత్రంగా వున్నంతకాలం—అక్కచెల్లెళ్ళు కలిసేవున్నా పెళ్ళయ్యాక కొత్త బంధాల మధ్య చిన్న దానికి ఊపిరి సలపలేదు! చలపతికి గుమాస్తా మనస్తత్వం మాత్రమే గాక, పక్కింటి పడిపోతున్న చూరు బాగు వేయించడం — అంటే బయటి బురద వంటివి పులుముకోడం లాంటి పనులంటే మహా ఉత్సాహం—యింట్లో పుచ్చిపోతున్న వాసాల సంగతి అంతగా మనసుకు పట్టదు. ఈ రకంగా అనాథ అయిన ఆ బాలికకు—కాలికి బలపం కట్టుకుని — ఉద్యోగం వస్తేందు చేయించుకునే స్థితికి తెచ్చుకుని లొట్టపోయిన కంటితో ప్రాణం మిగుల్చుకుని—తిరిగి పెళ్ళి సంబంధం కుదిర్చి స్వయంగా వివాహ మహోత్సవం జరిపించాడు. ఆ పిల్ల డబ్బులో వాటా చిక్కించుకున్నాడు. కిట్టని వాళ్ళలాగే అంటూం టారనిపించింది. కిట్టని వాళ్ళెవరో కాదు ఆ మహాతల్లులూ వాళ్ళ బాగోగులు పట్టించుకున్న పాపానబోని అక్క, బావలూ మొదలయిన వారు.

చలపతి పెద్దకూతురూ, చిన్నకూతురూ ఒకేసారి స్కూల్ ఫైనల్ పరీక్ష వ్రాశారు. వాళ్ళు చదవడం చలపతి కెంతమాత్రం నచ్చిందికాదు. 'మన సంస్కారానికీ, సంప్రదాయానికీ ఆడపిల్లలు చదవడం పడదూ, చదివింతర్వాత వీళ్ళకీ, వీళ్ళని కట్టుకున్న మొగుళ్ళకీ ఉద్యోగాలు చెయ్యాలనీ, చేయించాలనీ పోయేకాలం బుద్ధిపుడుతుంది' అని చలపతికి నిశ్చయమైన అభిప్రాయం. అయినా పెద్దాడు బాబ్జికి పోయేకాలం బుద్ధులు ఏనాడో వచ్చాయి. తండ్రి నెదిరించడం నేర్చుకున్నాడు. చలపతికంటే అతనిభార్యది కొంచెం ముందు చూపు. గుమాస్తా భార్యగా బ్రతకవలసిన దుర్గతి చదువుకుంటే పట్టేది కాదని ఆమె నమ్మకం. ఆమాట పైకి అన్నప్పుడల్లా ఆవేశపరుడైన చలపతి గట్టిగా అరుస్తాడు. ఇప్పుడిప్పుడే కొంచెం పిరికితనం పట్టుకుంది కానీ, లేకపోతే పులుసులోకి లేకుండా ఎముకలూ విరుస్తాడు. పరీక్ష రాసింతర్వాత పెద్దది తప్పికూర్చుంది. చిన్నది పరీక్ష అయింది. పెద్దదానికి నాన్న పోలిక లొచ్చాయని అంటూంటాడుకూడా తిరుగుబాటుదారుడైన బాబ్జి!

పైన చలపతి భార్య చెప్పింది పరీక్ష తప్పిన కూతురు గురించే! ఓరోజు పరీక్ష తప్పిన దానికీ చలపతికీ పెద్ద వాగ్యుద్ధం జరిగిందికూడాను.

'ఏనాడైనా ముచ్చటగా సినిమాకైనా వెళ్ళమన్నావూ ? వాళ్ళకీ వీళ్ళకీ మెహర్బానీగా పన్లు చెయ్యమంటే చేస్తావుగానీ, యింట్లోవాళ్ళు పీనుగుల్లా బ్రతుకుతున్నారే అన్న ఆలోచన నీకుందా అంట...' అంది లక్ష్మీదేవి.

చలపతి కంతగా వివేకంలేదని బంధువుల్లో అందరూ అనుకునేమాట! అందుకనే కాబోలు కూతురుతో సమానంగా రెచ్చిపోయాడు.

'నోర్మూయ్యవే; నోర్మూయ్య మంటున్నాను. పరీక్ష పాసవడం చేతకాదుగాని, తండ్రి నెదిరించమంటే తయారు. సిగ్గులేకపోతే సరి. ఏ నూతిలోనో దూకిచస్తే బాగుంటుంది—యిలా చేతకాని బ్రతుకు బ్రతక్క—చావు ఒక్కసారి.'

'అవును ! నన్ను చావమంటావు అనవూ? బ్రతికుంటే పెళ్ళి చెయ్యాలిగా...'

ఇలా సాగింది వాళ్ళ యుద్ధం అని ప్రక్క యిళ్ళవాళ్ళు, చలపతి పెళ్ళాంకూడా అను కుంటూంటారు.

ఇదికాక—ఆ మహాతల్లి—పెళ్ళిసమయంలో వాళ్ళు వీళ్ళని ఏదో ఎద్దేవా చేశారని ఒక మాట. ఇవన్నీ కలిసి చలపతి మొదటి ఆడ పంట లక్ష్మీదేవి బుర్ర చెరిచేశాయి. ఆ అమ్మాయి పిచ్చివాలకంతో యిల్లు గొల్లు మంటుండేది. ఆరునెల్ల క్రితంవరకూ, పన్నెండురోజులపాటు ఎవరో గురువుగారు పూజలు చేశాడు — ఏదో కామినీగ్రహం పట్టిందని— వారంరోజులపాటు యింగ్లీషు మందూ, పదిరోజులపాటు హోమియో మందూ వేసిచూశారు. పన్నెండూ, ఏడూ, పదీ, ఇరవైతొమ్మిది రోజులయాక ముప్ఫయెన్నోరోజున ఆయుర్వేదం వైద్యుడి దగ్గరకు తీసుకువెళ్దామని అనుకుంటే లక్ష్మీదేవి కనిపించకుండాపోయింది. గొల్లుమన్నారు ఓపికున్నంతవరకూ! కూతుర్ని స్వంతచేతులతో చంపుకుంటున్నాడంటున్నారందరూ అని చలపతికి అనుమానం, అతని దగ్గరకొచ్చి ఎవరూ అనకపోయినా! అనే వారేమోగాని చలపతి వాలకం మరీ మారిపోయిందీ మధ్య. 'పాపం చలపతి!' అన్నట్లు తయారయ్యాడు. ఏదో ఆవేశంలో పిల్లల్ని ఏదో అంటారు కానీ, పిల్లలుపోతే భరించగల్గిన గుండె లెక్కడుంటాయనీ?

సరిగ్గా నెలరోజులక్రితం ఓ వింత జరిగింది. కారు మబ్బుల్లోంచి మెరుపు తళుక్కుమన్నట్లుందని అభివర్ణించారు ఆధునికులయినవారు. గొడ్రాలి కడుపున పిలక మొలిచినట్లుందని అనుకున్నారు పాతకాలపు వాళ్ళు. లేకపోతే చలపతి జన్మలో పెళ్ళిళ్ళు కూడా చేయగలడా అని! చలపతి రెండవ కూతురు శైలా అయింది. అంటే ఆమె ఎవర్నో ప్రేమించి దౌర్భాగ్యురాలయిందని కాదు. శైలా అనడం కన్న ఏ శకుంతలో అనడం బాగుంటుందేమో శకుంతల కథ దుఃఖాంతం కాదుకదా! చిట్టి కథ అంతం ఎలావుంటుందో ప్రపంచంలో గుమాస్తా బ్రతుకులు చూస్తున్న వాళ్ళకి చెప్పడం

కష్టం కాకపోయినా 'అపశకునం మాటలు' అంటారనే జంకుతో ఊరుకోవచ్చు. ప్రేమలో కథానాయకి అవడం సుఖప్రారంభం అనే అనుకోవాలి ఆధునికులూ, ఛాందసులూ కూడా!

వీధి మొగన వెంకట్రాయుడిగారింట్లో చిట్టిని చూసిన ఒక గుమాస్తా బ్రహ్మచారి ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకోవాలనుండి, కట్నాలు కాశపడేందుకు నాకు 'నా' అనే వాళ్ళెవ్వరూ లేరు అని అన్నట్లు చలపతి పెళ్ళాం రామి చెవిలో పడింది. సైడు కాలవల్లో చేపలు పట్టడంలాంటి జీవితంలో చిట్టి లాంటి కన్నె పిల్లలకు గుమాస్తాలకన్నా పెద్ద చేపలు ఎక్కడ్నించి దొరుకుతాయి కనక! చిట్టికి ఆనందమే అయింది. చలపతిలాంటి నాన్నకి కూతురైందైన దానికి ప్రేమలో పాత్ర దొరకడం ఎంత అదృష్టం, అనిపించింది. ఓ పూట ప్రేమా, మరో పూట అన్నం తిని కాలం గడుపుకురావచ్చుని అనుకుంటా చిన్నది. వయసులో వుంది మరి! చలపతి పెళ్ళానికి అంబారీ ఎక్కినట్లయింది. చలపతికి ఆనందమో, దుఃఖమో తెలియలేదు......

వర్షంలో పూర్తిగా తడిసిపోయాడు చలపతి. చలిగా వున్నట్లుంది కూడా! అయినా ఆగదల్చుకోలేదు చలపతి. కసిగా వుంది అతనికి. 'వెధవది! తను పుట్టిం దగ్గర్నుంచి కురుస్తోంది యీ వాన... దీనికా భయపడ్డం!' అనుకుంటున్నట్లున్నాడు.

వర్షం ఆగేటట్టు లేదు. బజార్లో చెరిమయ్యశెట్టి దుకాణం చేరేసరికి పై బట్టలే కాకుండా లోపలి రక్తంగూడా తడిసి నీరు గారిపోతుందేమో! అసలే రక్తం తక్కువ మనుషులకి. ఉన్నది కాస్తా నీళ్లలో పల్చబడిపోతే నెల్లాళ్ళా పాపం మంచంలో మనిషి నాశ్రయిందుకున్న నల్లుల గతేం కాను? మనిషిని మోసంచేస్తే తిరిగి మోసం చెయ్యగలడు నోరులేని జీవాల్ని మోసం చేస్తే పాపంకదూ...చలపతి విచిత్రంగా నవ్వుకున్నాడు.

మనోరమ టాకీసుదగ్గరకు వచ్చాడు చలపతి. ఏనాటిదో పాత సినిమా—బీదలపాట్లు—ఆడిస్తున్నారు. ఏనాడు చూశాడో సినిమా, చూస్తే బాగానే వుంటుందనిపించింది. కానీ బట్టలన్నీ తడిసిపొయ్యాయే! అదీకాక 'హౌస్‌ఫుల్' బోర్డు పెట్టేశాడు టాకీసువాడు. జనం టాకీసు వదిలివెళ్ళిపోతున్నారు కాస్త చినుకు తగ్గడం చూసి. ఎవరో ఆడమనిషి ఆదేపనిగా చూస్తున్నది చలపతికేసి. వర్షంలో తడవలేదుగామోను, ఆ రేషిన బట్టలావుంది. చవకరకం సెంటువాసన. నల్లగా వున్నా నిగనిగలాడుతున్న శరీరం. కొత్తరకం ముస్తాబు, చూస్తుంటే సరదాగానే అనిపించింది. మరీ అలా చూస్తుంది బజారు సరుకేమో అనుకున్నాడు చలపతి.

ఒక క్షణంపాటు, చలపతిలో యిరవై ఏళ్ళు వెనక్కి...

వయసు—రక్తం—వేడి...ఆడది—ఒడుపైన గుండెలు, కితకితలు పెట్టేగుండెలు,



ఆగండి!

గుడ్డలు త్వరగా చినిగి పోతున్నాయని బాధపడుతున్నారా?

అయితే ట్విన్‌టస్కర్‌కు మార్చటానికిదే సమయం? ఈ వస్త్రాలలోని వైవిధ్యాన్ని మీరు యిష్టపడతారు మధుర మిల్స్ వారి భారీ ఉత్పత్తి అవకాశములవలన గట్టితనము, ఎక్కువకాలం మన్నిక, అద్భుతమైన [illegible], సరసమైన ధర నిర్ణయము సాధ్యపడినవి. జ్ఞాపకముంచుకోండి, సరసమైన ధరకు లభించే నాణ్యతకు ట్విన్‌టస్కర్!

మధుర మిల్స్ కంపెనీ లిమిటెడ్, మధురై
(మేనేజింగ్ ఏజంట్లు: ఎ & ఎఫ్ హార్వే లిమిటెడ్)

హార్వే

ట్విన్ టస్కర్

'పాప్లిన్ • డ్రిల్ • లాంగ్‌క్లాత్'

సరసమైన ధరకు నాణ్యత!

మధురకు చేరిన హార్వేస్

[illegible]
జరిపోయె విప్పుకున్నాలాగా తగలు.

ఆ నల్లని మనిషి, ఆడమనిషి, మరో పిల్ల లాల్చీ అతను, యిద్దరూ రిక్షాలో వెళ్ళిపోయారు.

'ఛీ! కాలుజారితే భగవంతుడు క్షమిస్తాడా, రాముడు పుట్టిన గడ్డమీద పుట్టడం కూడాను' అనో, ఆ అర్థం వచ్చేట్లుగానో అనుకున్నాడు చలపతి.

టాకీసుదగ్గర ఓ క్షణం ఆగిన చలపతి మళ్ళీ బయలుదేరాడు. చీకటి కూడా అల్లుకుంటోంది. కొంచెం వర్షం తగ్గిందికనక, జనం కొన్త అటూ యిటూ తిరుగుతున్నారు రోడ్డుమీద.

చలమయ్యశెట్టి దుకాణంముందు జనం గలాటాగా కూడారు. ఎవ్వరో యిద్దరు రోడ్డుమీద నిలబడి తిట్టుకుంటున్నారు. ఒకతన్ని చలపతి ఎరుగును. శెట్టి కొట్లో గుమాస్తా వెంగళప్ప. పేరుకు విరుద్ధంగా వాడు శెట్టి జరిపే కాంట్లో సగం దొంగవ్యాపారానికి ఆయువు పట్టు అంటారు. రెండవ అతను ఎవ్వరో, పాపం, గౌరవనీయుడిలాగానే వున్నాడు. టెర్లీను డ్రెస్సులో వున్నాడు. 'సెంటిస్టారి ధర్మమా అంటూ ఈ టెర్లీ నొకటి వచ్చింది. అప్పోసొప్పోచేసి ఓటి కొనుక్కుంటే జీవు బండిని వాడినట్లు తుక్కుగా వాడొచ్చు. డాబుగానూ వుంటుంది......' వెంగళప్పలాగా మొరటు మాటలు వాడడం లేదు......అప్పుడప్పుడు యింగ్లీషు వాడుతున్నాడు.

చలపతికి గొడవేమిటో అర్థమయ్యేసరికి అరగంట పట్టింది. టెర్లీను అతను నిన్న వచ్చి కిలోన్నర పంచదార తీసికెళ్ళాట్ట! ఇచ్చిందానికంటే రెండు కిలోలు ఎక్కువగా కార్డుమీద వ్రాశాట్ట వెంగళప్ప...! 'సత్య హరిశ్చంద్రుడి తాతలాంటి నాకు దొంగతనం అంటగడ్తావా నాయాల, ఎక్కువ తీస్కెళ్ళి ఇయ్యాల తగూ తెస్తావా...' అనే అర్థంలో వెంగళప్ప చెరిగేస్తున్నాడు! 'దొంగ వ్యాపారం చేస్తే భగవంతుడు నీ నోట్లో కర్ర కొట్టకపోడులే' అనికూడా లేస్తున్నాడు ఆ పెద్దమనిషి. ఈ ప్రపంచంలో భగవంతుడంతటి బలహీనుడు మరెవ్వడూ ఉండడని ఆ క్షణంలో అతనికి తట్టలేదు. కలక్టరు దగ్గర పెర్సనల్ అసిస్టెంట్ కున్న పలపతి కూడా లేనివాడు కదా పాపం. అరగంట ఓపిగ్గా గడిచింతర్వాత,

వర్షంలో మనిషి

ఆ టెర్లీ అతన్ని, అసలే నిముగ్గా వున్న జనం సహాయంతో బెంబేలు చేసి గెంటేసి సంతపని చేశాక నెమ్మదిగా వెంగళప్ప దృష్టి వాకర్షించాక చలపతి తన జాబితా యిచ్చాడు.

'శనగపప్పు'

'లేదండి పోపుల్లోకి కూడా దొరకటం లేదు. ఏంటి గిరాకీ......అమ్మాయిగారికి పెళ్ళని యిన్నాం.. మరీ అంత అవసరమంటే మీ రడుగుతున్నారు కనక...కిలో ఆర్రూపాయలు......'

'కందిపప్పు.'

'కిలో మూడ్రూపాయలు...ఎంతా ?'

'చింతపండు.'

'కిలో ఐదురూపాయలు ... మనింట్లో మేలిరకంగాని వాడరంటే కిలో ఆర్రూపాయల డెబ్భైరకం వుంది...'

అలా సాగింది వ్యవహారం. క్షణానికి డెబ్భైరెండుసార్లుకొట్టుకుంటున్న చలపతి గుండె లసలు ఆగిపోయాయి ధరల ధాటికి. ...తనకొచ్చే ముప్పై రెండువందల యాభై రూపాయలకి...ఈ ధరలకీ...ఏంటికానేది... ఆ బాబ్జిగాడు కూడా ఏదో ఉద్యోగం చూసుకుంటే ... ఉద్యోగం చేసుకుంటే ఊరుకో బుద్ధౌతుందా ... వాడికీ పెళ్లి కావద్దా ... సమస్య బరువుగా తోచింది. ముప్పైఫు రూపాయలిచ్చి కొన్న సరుకుల సంచీ అంతకంటే చాలా తేలిగ్గా వుంది.

'వైమయిపోయింది, బియ్యం రేషను యివ్వాళ యియ్యం. యింకా రేపు శెలవు. ఎల్లుండి రండి' అంటూ తలుపులువేసే ప్రయత్నంలో పడ్డాడు శెట్టి తన బలగంతో సహా.

'ఇంట్లో ఒక్క గింజ లేదు...'

'ఈ మాటలన్నీ యిని యిని యిసిగేసి పోయిందండి. అయిపోయిందాకా ఎవరు కూర్చుండమన్నారనీ ... మధ్యాహ్నం రాకూడదూ. ఓ పిల్లాడ్నిక్కడే పోస్టు చెయ్య కూడదాని!' అంటూ యికిలించాడు శెట్టి. ఆ హాస్యం విని నవ్వే ఓపిక ఎవరికుందని...'

'చదువులూ, ఉద్యోగాలూ మానేసి ఈ షాపులదగ్గర కూర్చుందాం యింక. వెధవ రోజులొచ్చిపడ్డాయి.' అంటూ నీరసంగా యుద్ధంలో ఓడిపోయిన సైనికుల్లా మొఖాలు వేలాడేసుకుని వెళ్ళిపోతున్నారు ప్రజలు.

'[illegible] కుంపట్లార్పేసుకోండి!' అన్నాడు శెట్టి. వెళ్ళిపోతున్న వాళ్ళలో ఎవడికో వళ్ళు మండింది.

'చూడండి! మంత్రిగారి బామ్మర్దిలా ఆ పొగరు. కుంపట్లు ఆర్పేసుకోడం కాదురా... నీ కొట్లో కుంపట్లు వెలిగిస్తాం ... రండయ్యా! వీడి పొగరణుద్దాం...'

పదిమంది, పదిహేనుమంది ... పాతిక మందిదాకా శెట్టి కొట్టు మీద పడ్డారు. యిద్దరు శెట్టిని, యిద్దరు వెంగళప్పని గట్టిగా పట్టుకుని నాలుగు వేశారు. కొట్లో కుర్రాళ్ళు పరుగెత్తిపోయారు... మిగిలినవాళ్లలో ఒకడు కౌంటరు దగ్గర కూర్చుని బిల్లు రాశాడు. మరొకడు డబ్బు లెక్కపెట్టాడు. ఇద్దరు తూకాలు చూశారు. అరగంటలో అందరూ బియ్యం, పంచదార తీసుకెళ్లారు ... ఆ టైముకి పోలీసులు వచ్చారు...పోలీసుల్ని చూసి వెంగళప్ప గింజుకోడం మొదలెట్టాడు ... కొట్లాట-పంచాయితీ...అరెస్టు ... ముగ్గుర్ని తీసికెళ్లారు పోలీసులు. దూరంగా నిలబడి చూస్తున్న చలపతికి బాధగా...నీరసంగా వుంది-యీ వ్యవహారం చూస్తుంటే. బ్రతుకు ... ఆకలి ...దరిద్రం...కొట్లాటలు...కిలో ఆర్రూపాయలు...ఏడ్రూపాయలు... మండిపోతోంది... బ్రతుకా యిది...

చలపతి వంటిమీది బట్టలు ఆరుతున్నాయి నెమ్మదిగా...యింటి మొఖంపట్టాడు బరువైన అడుగేస్తూ...

......యింట్లో కోలాహలంగా వుంది. ఆడంగులందరూ హడావుడిగా వున్నారు. చలపతి వుంటున్న అద్దె యింట్లో మూడు ముట్లు గదుల్లాంటి వున్నాయి మొత్తం మీద. అరవై రూపాయిలిస్తున్నాడు నెలకో సారి...అదీ తక్కువ అంటున్నాడు ఉదారుడైన యింటి యజమాని. ఒక గది కారోజు ప్రత్యేకమైన శోభ వచ్చింది. అది శోభనం గదైంది.

తాటాకు విసినకర్రతో విసురుకుంటూ ఆశ, విసుగు, ఆవేశం-అన్నీ ఒకటై ఎదురు చూస్తూ కూర్చున్నాడు గుమాస్తా చలపతి గుమాస్తా అల్లుడు. చలపతి యింట్లో ఆ రోజు ప్రొద్దున్న వివాహం జరిగింది.

'పెళ్లికూతురా రావే!' అంటోందో ముత్తయిదువ.

'సిగ్గెం దొంతరైపోయింది కదే మన చిట్టి...' అంటూ ముచ్చటలు పోయింది, బాడంగా ఏదో తలముకుంటున్న టైంకావిడ,

వర్షంలో మనిషి

ఓణీలు వేసుకుంటున్న అమ్మాయిలు ఆత్రంగా చూస్తున్నారు ... 'మీరు పొందే అంతరంకి ..' అని కసురుతున్నారు చీరలు కట్టుకున్న పెద్దవాళ్లు వాళ్లని! నవ్వుతూ దర్జాగా వెళ్తున్నారు వాళ్లు...వాళ్లకేదో తెలిసీ తెలియనట్టుండి సరదాపడుతున్నారు.

భుజాన సంచీ వేసుకుని, తడిసొడీ బట్టలతో వీధిగుమ్మం ఎక్కుతున్న చలపతి భార్యకంట పడ్డాడు.

'ఇదేం సోద్యమండీ ... రేపో ఎల్లుండో తెమ్మన్న సరుకులు ఈరోజే తెచ్చారా కొంప మునిగిందనుకుని. ఇంట్లో వుండమంటే వూరేగ వెళ్లారా...ఛఛ ... నా కర్మకొద్దీ దొరికారు కదండీ...'

'కర్మకొద్దీనే దొరికామే ఒకరి కొకరు. మూరుకు పట్టుకున్న పొగలా ఈ దరిద్రపు బ్రతుకు బ్రతుకుతున్నాం.' అన్నాడు చలపతి విసుగ్గా !

'చాల్లే ఊరుకోండి ... ఇంట్లో శుభ కార్యం జరుగుతుంటే దరిద్రం ఓడుతూ ఏవిటా మాటలు ?'

'నోర్మూయ్...'నీరసంగా అన్నాడు చలపతి.

భార్య తలలో పూలచెండు చూస్తుంటే చలపతికి ఎవరో కడుపులో కెలుకుతున్నట్టయింది. ఒకసారి ఆతనూ, భార్యా ముసలి వాళ్లయిపోయినట్లు అనిపించింది.

'ఆ పూలుకూడా ఎందుకే ముడిచావ్ ? ముసిలిపీనుగులం ... మనకి సింగారాలు కూడానా...నా...'

'తమరు లోపలికి దయచేయండి......' అంటూ విసురుగా కూతురు ముచ్చట్లు చూసేందుకు వెళ్లిపోయింది చలపతి పెళ్లాం.

'ఇంక దాన్నొదిలెయ్యండ్రా!' అని ఎవరో పచ్చదీపం చూపించారు......చిట్టి లోపలి కెళ్లిపోయింది......శోభనం గదిలోకి వెళ్లి పోయింది. ఈ భూమిమీద పుట్టినందుకు తన కడుపున నల్గురు పుడితే జన్మిచ్చిన దేవుడి ఋణం దీర్చుకోవచ్చునని వెళ్లింది.

చలపతి కడుపంతా కడుపులో తిప్పు తున్నట్టుంది

శోభనం గదిలో తన కూతురూ, అల్లుడూ...

'ఏ ఆనందతీరాలకో వెళ్లిపోతాం, అందాల మేడల్లో పాడుకుంటూ...బంగారు బ్రతుకులో ఆడుకుంటాం' అనుకుంటూ ఒకళ్ల నొకళ్లు మోసం చేసుకుంటారు' అని ఊహించుకుంటున్నాడు చలపతి.

'ఎవరు ఏం చెప్పగలరమ్మా... అమ్మాయి వచ్చిన వేళావిశేషంవల్ల అల్లుడు పెద్ద గుమాస్తా అయి... ఆఫీసరైనా అవచ్చు...' అంటున్నారొకరు.

'ఆఫీసరు ప్యూన్ కాకుండా వుంటే చాలు' చలపతి ఊహ!

'మా చిట్టి కడుపున రత్నాలేపుట్టొచ్చు. మీ మనవడు కలక్టరైనా కావచ్చు, కాదంటే తల్లీ...ఇప్పుడు కలక్టరు అయినవాడు ఒక ప్పుడు అమ్మదగ్గర 'అ ఆ'లు నేర్చుకున్న వాడే కాదంటే తల్లీ....భగవంతుడు మంచి వాళ్లని అన్యాయం చెయ్యడు సుమా...' ప్రపంచంలో ఎంత దాతృత్వం. కరుణ ఉన్నాయి!

'నా బొంద! మా వంశాలు ఏడుమడతలు వేసి విప్పినా కలక్టరు లేడు. వాడి ప్యూన్ కూడా పుట్టలేదు యింతవరకూ!'

'ప్రపంచమంతా చెడ్డవాళ్లే నన్నమాట ...అందుకే కలక్టర్లు, మంత్రులు కొంచెం మందిమాత్రమే వున్నారు...' జ్వరం తగిలి నట్లనిపించింది చలపతికి.

వచ్చిన వాళ్లందరూ వెళ్లిపోయాక, 'బొమ్మలపెళ్లిలా అయింది నా తల్లికి!' అనుకుంటూవచ్చిన చలపతిభార్య మంచం మీద కట్టెలా పడున్న చలపతిని ఓ క్షణం చూసి, వెర్రిబాగులమనిషి' అనుకుంటూ, చాపచుట్టలా వాలిపోయిన పిల్లల్ని...మురళి సీత, రాముడు, వెంకుగాడు, బుల్లిది అని పేరు పేరునా ఐదుగుర్ని లెక్కపెట్టుకుని, అప్పుడే సినిమానుండి వచ్చిన బాబ్జీని చూసి అన్నం పెట్టడానికని వంటింట్లోకి వెళ్లింది. చలపతి మరి అన్నానికి లేవలేదు ఆ రాత్రి.

కలతగా నిద్రపోయాడు చలపతి ఆరాత్రి.

నిద్రనిండా కలలు...కలలనిండా...మనుషులు ...వర్షంలో తడుస్తూ ... ఎండలో ఎండుతూ ... ఫైళ్లమీద వాలిపోతూ... మనుషులు...పిచ్చిమనుషులు... రేషన్ షాపు... పాలబూతు......బీదలపాట్లు సినిమా... సినిమా దగ్గరి పడుచుది......బెజవాడ స్టేషన్ దగ్గరొచ్చేటప్పు డెదురయ్యే కొండబ్బా దాని గుండెలు...కలెక్టర్లు... పోలీసులు... మంత్రులు ... మంత్రసాన్లు... పోయిన లక్ష్మీదేవి ... ఒకరేమిటి, అందరూ కనబడ్డారు. చివరి కలలో కలక్టరు మనవడు...

తెల్లవారకట్ట ఐదుగంటలప్పుడు మెలకువ వచ్చింది. శోభనం గది తలుపు తెరుచుకుని, దేశానికి పండంటి బిడ్డ నిచ్చేందుకు తన ప్రయత్నం తను చేశాననే తృప్తితో బయటపడింది చిట్టి తల్లి... తెరచివున్న తండ్రి కళ్లవంక సిగ్గుతో చూసి తల దించుకువెళ్లింది.

'మొహం కడుక్కోండి...నీళ్లు పెట్టాను' చలపతి మొహం కడుక్కున్నాడు.

'వేడినీళ్లున్నాయి. నీళ్లు పోసుకోవడం కానీండి నాన్నా!'

చలపతి స్నానం అయింది.

'నిన్న సినిమా హాల్లో బాంకు మేనేజరు కొడుకు స్నేహితుడయ్యాడు నాన్నా... బాంకులో కాళీలున్నాయట'

'ఉద్యోగం దొరకొచ్చొన్నమాట'—చలపతి ఆలోచన.

'అల్లుడు కూడా తయారుగా వున్నాడు. భోజనానికి లేవండి.'

చలపతి భోజనం కానిచ్చాడు.

వంకాయ పెరుగుపచ్చడి......చలపతి యిష్టం...ఉల్లిపాయ పులుసు ... చలపతి ప్రాణం...పెరుగు.. చలపతికి వరం..

'ఇదుగో తమలపాకు వేసుకోండి'

తాంబూలం వేసుకున్నాడు చలపతి.

పంచ మరోసారి ఊడదీసి చక్కగా కుచ్చెళ్లుపోసి కట్టుకున్నాడు చలపతి. తల దువ్వుకుని, చెప్పుల్లో కాళ్లుదూర్చి తీరిగ్గా, బయలుదేరాడు.

'చిట్టి తల్లి కడుపున కలక్టరే పుడ్తాడేమో!' అనిపించిందెందుకో చలపతికి.

'నేనూ వస్తున్నానండీ!' అంటూ అల్లుడూ కూడా చెప్పులేసుకున్నాడు.

'ఈ రోజు సెలవుపెట్టక పోయావుటోయ్?'

'లేదండీ! యివ్వరు. ఆడిట్ టైమ్ కూడాను!'

'వర్షం పడేట్టుందే!' అన్నాడు ఆకాశం కేసి చూసి అల్లుడు.

ఓసారి వెనక్కి తిరిగిచూశాడు. చిట్టి తల్లి కళ్లు, అల్లుడి కళ్లు, కలెక్టరుగారి క్కాబోయే కళ్ల నకళ్లు.

'పెద్దగా పడేదికాదులే!' అంటూ అడుగేశాడు చలపతి.

సన్నటి తుప్పర పడుతోంది.

వర్షంలో తోడుగా వెళ్తున్నారు గుమాస్తా, చలపతి, గుమాస్తా అల్లుడు.